క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

మంచాల: మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్కాలర్‌షిప్ (ఉపకార వేతనాలు)కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 49 మంది విద్యార్థినీలు మలబార్ గోల్డ్అండ్ డైమండ్స్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కొక్కరికి రూ.8 వేల చొప్పున.. రూ.3 లక్షలు 92 వేలు పొందారని తెలిపారు.

సర్పంచ్‌ల సేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, బాలరాజ్



మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డిని సన్మానించిన జైపాల్‌యాదవ్, బాలరాజ్

కడ్తాల్: గ్రామాల్లో సర్పంచ్‌లు అందించిన సేవలు అభినందనీయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ కొనియాడారు. సోమవారం కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ కాలం పూర్తి చేసుకున్న వివిధ గ్రామాల సర్పంచ్‌లకు, బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జైపాల్‌యాదవ్, బాలరాజ్ సన్మానించారు. పదవీ లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.

'గృహజ్యోతి'కి వివరాలివ్వండి



ఆధార్, రేషన్ కార్డు నంబర్లను సేకరిస్తున్న సందీప్‌కుమార్

యాచారం: గృహజ్యోతి పథకం అమలు కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్హులు పూర్తి వివరాలిస్తే.. ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని మండల విద్యుత్ శాఖ ఏఈ సందీప్ కుమార్ కోరారు. మండల పరిధిలోని మాల్ గ్రామ పంచాయతీలో సోమవారం గృహజ్యోతి పథకానికి సంబంధించి లబ్ధిదారుల నుంచి ఆధార్, రేషన్ కార్డు నంబర్లను సేకరించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. గృహజ్యోతి పథకం పొందాలంటే పూర్తి వివరాలు అందజేస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బట్టు శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల సీఐకి సన్మానం

మంచాల: మంచాల సీఐ బబ్యానాయక్‌ను చిత్తాపూర్ మాజీ సర్పంచ్ నాగరాజ్ గౌడ్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ మంచాల మండలంలోని వివిధ గ్రామాల్లో శాంతి భద్రతల విషయంలో సరైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తాపూర్ గ్రామ నాయకులు మల్లేష్, రాజు, రవి, చంద్రయ్య, శ్రీను, నర్సింహ, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే.. భవిష్యత్తు నిర్ణేతలు

మాడ్గుల: నేటి విద్యార్థులే రేపటి పౌరులు మాత్రమే కాదని, భవిష్యత్తు నిర్ణేతలు కూడా అని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. సోమవారం మాడ్గుల మండలంలోని చంద్రయాన్ పల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ సభ్యుడు రామ్‌రెడ్డి రూ.8 వేలు విలువ చేసే ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు.

డిగ్రీ కళాశాల భవనాన్ని ప్రారంభించాలి

ఇబ్రహీంపట్నం: విద్యాసంవత్సరం ప్రారంభం లోపు వినోబానగర్‌లో నిర్మిస్తున్న డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేవైఎం జిల్లా ప్రొటోకాల్ సెల్ కన్వీనర్ శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కళాశాల భవనాన్ని సోమవారం బీజేవైఎం నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ 2016లో అప్పటి మంత్రి కేటీఆర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఇప్పటివరకు పూర్తి స్థాయి నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ఇబ్రహీంపట్నంలోని జూనియర్ కళాశాలలో షిఫ్ట్ పద్ధతిలో డిగ్రీ కళాశాల కొనసాగుతోందన్నారు. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాయితేజ, రాజు, సందీప్‌గౌడ్, మహేశ్ ఉన్నారు.

పల్లె దారులకు మంచి రోజులు

- కాలనీల రోడ్లన్నీ ఇక సీసీ రోడ్లే
- ఇబ్రహీంపట్నం డివిజన్‌కు రూ.12 కోట్లు
- మార్చి 30 లోపు పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కే

ఇబ్రహీంపట్నం డివిజన్‌కు మంజూరైన నిధులు

మండలం	నిధులు(లక్షల్లో)
మంచాల	రూ. 271.50
ఇబ్రహీంపట్నం	రూ. 253.00
యాచారం	రూ. 458.00
అబ్దుల్లాపూర్‌మెట్	రూ. 217.50



యాచారంలో ఈజీఎస్ నిధులతో సీసీగా మారనున్న ఓ కాలనీలోని రోడ్డు

యాచారం: పల్లె రోడ్లకు ఇక మహర్దశ పట్టనుంది. ఇన్నాళ్లు గుంతలమయంగా ఉన్న కాలనీల రోడ్లన్నీ ఇక సీసీ (సిమెంట్) రోడ్లుగా మారనున్నాయి. 2023–24 సంవత్సరానికి గాను ఇబ్రహీంపట్నం డివిన్‌లోని ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని 231 గ్రామాలకు రూ.12 కోట్ల ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. డివిజన్‌లోని పలు గ్రామాల్లోని వెనుకబడిన కాలనీల ప్రజలు సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పక్షం రోజుల కింద పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు ఏఏ గ్రామాల్లో సీసీ రోడ్లు అవసరం ఉన్నాయో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులకు అందజేశారు. ప్రజా ప్రతినిధుల నివేదికను పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ శశాంకకు అందజేయగా ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని నాలుగు మండలాల్లోని 231 గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు రూ.12 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

గడువులోగా పూర్తి చేయాలి

మంజూరైన ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామాల్లో మార్చి 30 లోపే సీసీ రోడ్లు వేయాల్సి ఉంటుంది. లేదంటే మంజూరైన నిధులు మళ్లీ వెనక్కు పోయే అవకాశం ఉంటుంది. కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించాలో ప్రతిపాదనలు సిద్ధం చేసిన ప్రకారం రెండు, మూడు రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తేనే మరో 20 రోజుల్లో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంటుంది. పనులు పూర్తి చేయడానికి మరో 45 రోజుల గడువే ఉంది. మంజూరైన నిధుల ద్వారా సీసీ రోడ్లు పూర్తి చేస్తే ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. కానీ రూ. లక్షలాది నిధులు మంజూరైన త్వరగా సీసీ రోడ్లు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కు పోయే అవకాశంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తప్పవు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం నగరంలోని తన నివాసంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులను పిలిచి అన్ని గ్రామాల్లో ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్లు ప్రారంభించి పూర్తి చేసేలా కృషి చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడ చొరవ తీసుకుంటే మీకే మంచి పేరు వస్తుందని సూచించారు.

సంతోషంగా ఉంది



యాచారం మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి గాను రూ.4 కోట్ల 58 లక్షల ఈజీఎస్ నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉంది. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రంగారెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు. మంజూరైన నిధుల ద్వారా అన్ని గ్రామాల్లో రోడ్లు సుందరంగా మారుతాయి. ప్రజాప్రతినిధులు త్వరగా పనులు ప్రారంభించాలి. - సుకన్య, ఎంపీపీ యాచారం

పనుల్లో నాణ్యత ఉండాలి



మంజూరైన ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామాల్లో మార్చి 30 లోపే సీసీ రోడ్లు పూర్తి చేయాలి. లేదంటే మంజూరైన నిధులు వెనక్కు పోయే అవకాశం ఉంటుంది. సకాలంలో పనులు చేయకపోతే బిల్లులు కూడ రావు. తర్వాత కాంట్రాక్టర్లు అప్పుల పాలవుతారు. పనుల్లో నాణ్యత ఉండాలి. ఇబ్రహీంపట్నం డివిజన్‌కే అత్యధిక నిధులు రూ.12 కోట్లు మంజూరయ్యాయి. - శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, పంచాయతీ రాజ్ శాఖ

'చలో నల్లగొండ' పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలరాజు, జెడ్పీటీసీ అనురాధ

ఆమనగల్లు: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడాన్ని నిరసిస్తూ నల్లగ జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభ పోస్టర్లను ఆమనగల్లు పట్టణంలో సోమవారం అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ నల్గొండలో జరిగే బహిరంగ సభలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొంటారని, ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, నాయకులు లాలయ్యగౌడ్, శ్రీనునాయక్, రమేశ్, నిరంజన్‌గౌడ్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, యాదయ్య, జగన్, గణేశ్, అంజియాదవ్ పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడాన్ని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో మంగళవారం నల్గొండలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు కోరారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ శ్రేణులు, ప్రజలను ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి తరలించాలని కోరారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: కడ్తాల్ మండలం ఎంపీడీఓగా పని చేస్తున్న రామకృష్ణ వికారాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణను ఎంపీపీ కమ్లీమోత్యానాయక్‌తో పాటు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మూడేళ్లుగా రామకృష్ణ ప్రజలకు అందించిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుసూధనాచారి, ఎంపీటీసీలు రాములుగౌడ్, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు ఎల్లాగౌడ్, కాశీనాథ్‌రెడ్డి ఉన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

తుర్కయంజాల్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 16న చేపట్టిన దేశ వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ పిలుపునిచ్చారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తుర్కయంజాల్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగ, కార్మిక సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. నాయకులు సత్యనారాయణ, ప్రకాశ్ కారత్, వెంకటకృష్ణ, జ్యోతిబాస్, హరీశ్, హనుమంత్, బాలరాజ్, శంకర్‌రావు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

హయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు నర్సింహ కోరారు. సోమవారం ఆయన పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కుంట్లూర్‌లో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశాన్ని కాషాయికరణ చేసేందుకు ప్రయత్నాలు జరగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మైసయ్య, జంగయ్య, నరింహ, రవి, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరాటే మాస్టర్ సోను

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మూడవ ఇంటర్నేషనల్ ఆల్ స్టైల్స్ కరాటే మరియు కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆమనగల్లుకు చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. అకాడమీ విద్యార్థులు చరణ్, ధార్విక, అశోక్, పూజిత, ప్రణవి, పూజిత, రితిక బంగారు పతకాలు, సిరి, యాసిన్, అక్షిత, పూజ, నిహారిక, భువనేశ్వరీ సిల్వర్ పతకాలు సాధించారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి
- 16న స్వామివారి కల్యాణోత్సవం
- 18న ముగియనున్న వేడుకలు



వేణుగోపాలస్వామి ఆలయం

కడ్తాల్: కడ్తాల్ మండలం మఖ్తామాధారం గ్రామంలో కొలువైన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు నేడు (మంగళవారం) ఉదయం ప్రారంభమై.. ఈ నెల 18వ తేదీ ఆదివారం ముగియనున్నాయి. ఆరురోజుల పాటు, భక్తజన సందోహం మధ్య వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాటు పూర్తి చేశారు. ఉత్సవాల వివరాలను అనువంశిక అర్చక ధర్మకర్త తిరుమల వింజమూరు రామానుజాచార్యులు తెలిపారు.

ఉత్సవ వివరాలు

- 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, స్వస్తివాచనం, ఋత్విగ్వరణం, రక్షాభంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణం నిర్వహిస్తారు.
- 14న నిత్యవిధి, ఆదివాస హోమం, ద్వజారోహణం, బేరిపూజ దేవాతహ్వానం, పల్లకి సేవ ఉంటుంది.
- 15న నిత్యవిధి, అభిషేకం, గరుడవాహన సేవ, మోహినిసేవ,
- 16న శ్రీవారి కల్యాణోత్సవం, చంద్రప్రభసేవ, రథోత్సవం, అన్నదానం నిర్వహిస్తారు.
- 17న, గంధావళి ఉత్సవం, నిత్యవిధి, అభిసేకం, హోమం, శ్రీవారి అశ్వవాహన సేవ.
- 18న నిత్యవిధి, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజా అవరోహణం, దేవతా విసర్జనం, ద్వాదశారాధనం, పుష్పయాగం, సప్తవరణ మహాదాశీర్వాదంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

విద్యార్థుల ఉత్తమ ప్రదర్శన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాడ్గుల: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ మాడ్గుల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు జిల్లాస్థాయి కాంపిటీషన్ నిర్వహించారు. ఇర్విన్ జెడ్పీహెచ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆర్. అశ్విని, 9వ తరగతి విద్యార్థి పెయింటింగ్ పోటీలో ద్వితీయ బహుమతిని ఏ. అంజలి, 9వ తరగతి పాటల పోటీలో ద్వితీయ బహుమతి గెలుచుకుంది. ఈ కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి సీహెచ్. రాజిరెడ్డి అతిథులుగా హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులను ఇర్విన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు, ఉపాధ్యాయులు సుధారాణి, ముత్యాపురెడ్డి, నాగమణి, మోగులయ్య, భిక్షపతి, సుజాత, అర్చన, శ్రీలక్ష్మి, జగన్ ,రవీందర్ రావు, వెంకటేశ్వర్లు అభినందించారు.

ప్రజాపాలనలో అధికారులదే కీలకపాత్ర

ఎంపీపీ సుకన్య



ఎంపీడీఓ విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీపీ సుకన్య, అధికారులు

యాచారం: ప్రజాపాలనలో అధికారులదే కీలక పాత్ర అని, విధి నిర్వహణలో క్రియాశీలకంగా పని చేసిన అధికారులను ప్రజలు గుర్తించుకుంటారని ఎంపీపీ సుకన్య పేర్కొన్నారు. బదిలీపై వికారాబాద్‌కు వెళ్తున్న యాచారం ఎంపీడీఓ విజయలక్ష్మిని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు కళ్లని వ్యాఖ్యానించారు. యాచారం మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన విజయలక్ష్మి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని ఏ సమస్యలు లేకుండా కృషి చేశారని అన్నారు. ఉద్యోగ నిర్వాహణలో తనకు సహకరించిన ఎంపీపీ, జెడ్పీటీసీ, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులకు విజయలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య తండ్రి నారాయణ (90) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సోమవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు, ఎంపీటీసీ రమేశ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. పెంటయ్య కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ గౌస్, జగ్గారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చెన్నయ్య, జంగయ్య, మల్లేశ్, వెంకటయ్య, మహేశ్, పెంటయ్య, శ్రీశైలం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ 'ఓనర్స్' సమ్మె

అబ్దుల్లాపూర్‌మెట్: టిప్పర్లలలో అధిక లోడు రవాణా చేయడాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ నేటి (మంగళవారం) నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లు టిప్పర్ లారీ యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి తెలిపారు. టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సద్దుపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ టిప్పర్లలలో అధిక లోడును రవాణా చేయడాన్ని తాము ఖండిస్తున్నామని తెలిపారు. అధిక లోడును అరికట్టడడంతో పాటు టిప్పర్లలో పాసింగ్ లోడును రవాణా చేయాలనే డిమాండ్‌తో 13 నుంచి 18వ తేదీ వరకు టిప్పర్ లారీల యజమానులందరం సమ్మె చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమ్మెకు అన్ని రకాల క్రషర్ల యజమానులు, డాంబర్‌ప్లాంట్ల యజమానులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టిప్పర్ల యజమానులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

డిప్యూటీ డీఎంహెచ్ఓ ధరణికుమార్



మాట్లాడుతున్న ధరణికుమార్

ఇబ్రహీంపట్నం: గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ధరణికుమార్ సూచించారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండల టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి 18వ తేదీ వరకు విటమిన్ ఏ కార్యక్రమాన్ని గ్రామాల వారిగా చేపట్టాలని, విటమిన్ ఏ లోపం ఉన్న వారిని గుర్తించి వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల 20 నుంచి 27 వరకు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, వైద్యాధికారులు, ఐసీడీఎస్, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విటమిన్ ఏ ద్రావణం తాగించాలి

మాడ్గుల: చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి విటమిన్ ఏ ద్రావణం తాగించాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘువులు సూచించారు. మాడ్గుల మండల కేంద్రంలో సోమవారం మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. సమావేశంలో రాఘువులు మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 18 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు విటమిన్ ఏ ద్రావణం తాగిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిరంజన్ రావు, ఎంఈఓ సర్దార్ నాయక్, ఐసీడీఎస్ అధికారులు, వైద్యాధికారులు రఘురాం, దయాకర్, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడాలని వినతి

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, తహసీల్దార్ షేక్ ముంతాజ్‌కు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 120, 130 భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు బోరు వెల్స్ వేసి, కంచెను నిర్మించుకొని ఆక్రమణలకు పాల్పడినట్లు వినతిపత్రంలో వివరించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహరెడ్డి, వేణుగోపాల్, నాయకులు భాస్కర్‌రెడ్డి, మోత్యానాయక్, హన్మానాయక్, చందోజీ, శాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదయ్య ఉన్నారు.

శంకర్‌కు సన్మానం

కడ్తాల్: గిరిజన మోర్చా రాష్ట్ర నాయకుడు శంకర్‌నాయక్ జాతీయ స్థాయి సేవ మయూఖ పురస్కారం అందుకున్నారు. అఖిల భారత శాస్త్రీయ జానపద కళోత్సవంలో భాగంగా తారా ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు, శిల్పకళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో శంకర్‌నాయక్‌కు పురస్కారం అందజేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకర్‌నాయక్‌ను మండల బీజేపీ నాయకులతో పాటు, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు సన్మానించారు.

విరివిగా మొక్కలు నాటండి

తలకొండపల్లి: విరివిగా మొక్కలు నాటి వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా వైస్ చైర్మన్ బాలాజీసింగ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో బాలాజీసింగ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ యాదయ్య సోమవారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా బాలాజీసింగ్ మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు.

ఘనంగా మార్కండేయ మహర్షి జయంతి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలను పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం, అనంతరం మార్కండేయునికి డోలారోహణం నిర్వహించారు. శివస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలిసంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, సభ్యులు అప్పం శ్రీను, గాజుల శ్రీను పాల్గొన్నారు.